క్లుప్తంగా

మాధవరం చెరువులో కోళ్ల వ్యర్థాలు



మాధవరం చెరువులో కోళ్ల వ్యర్థాలు

విజయపురం: మాధవరం చెరువులో కోళ్ల వ్యర్థాలను పెద్ద మొత్తంలో కలుపుతున్నారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. పన్నూరు సబ్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న కోళ్ల షాపు యాజమాన్యం కోళ్ల వ్యర్థాలను చెరువులో వేయడంతో నీరు కలుషితమవుతున్నాయని, మూగ జీవాలు సైతం నీళ్లు తాగడం లేదు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి నిలిచి ఉన్న కోళ్ల వ్యర్థాలతో దుర్వాసన వస్తోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు కోళ్ల వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.

ఇల్లత్తూరు సర్పంచ్ మృతి



దీప్తరాజు మృతదేహానికి నివాళులర్పిస్తున్న కుమార్‌స్వామిరెడ్డి



దీప్తరాజు (ఫైల్)

విజయపురం: ఇల్లత్తూరు గ్రామానికి చెందిన సర్పంచ్ దీప్తరాజు (35) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె 2020లో జరిగిన స్థానిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ మద్దతుతో ఇల్లత్తూరు సర్పంచ్‌గా గెలుపొందారు. ఆమె మృతికి మాజీ మంత్రి ఆర్కే రోజా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఆమె సోదరుడు కుమార్ స్వామిరెడ్డితో పాటు, పార్టీ నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. కన్వీనర్ శివరాజు, వైస్ ఎంపీపీ బాలాజీ, సర్పంచ్ కుమార్, నార్పరాజు, అడ్వొకేట్ బాబు, శేఖర్‌రాజు, జిల్లు, సుబ్రమణ్యం, ప్రతాప్‌రాజు పాల్గొన్నారు.

పూలతోట లాభదాయకం



విరబూసిన రోజా పూలు



మిట్ట ప్రాంతాల్లో రోజా పూల తోట

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో చెరువుముందర కండ్రిగ గ్రామాల్లో మెట్ట భూముల్లో ఆధునిక సేద్యంతో రైతులు రోజా, గులాబీ, మల్లెపూల తోటలు సాగు చేస్తున్నారు. ఒక్కసారి నాటితే ఐదేళ్లపాటు దిగుబడి రాబడి వచ్చే చిట్టి రోజాలను డ్రిప్ సౌకర్యంతో సాగు చేస్తూ రోజా రాబడిని కళ్లజూస్తున్నారు. రోజా సాగుతో పాటు చిక్కుడు, బెండ, మిరప పంటలను కూడా ఇదే తరహాలో సాగు చేస్తున్నారు. చెరువుముందర కండ్రిగ గ్రామానికి చెందిన వడివేల్‌రెడ్డి రైతులకు పూల సాగులో ఆదర్శంగా నిలుస్తున్నాడు. – పాల సముద్రం

సాగు విధానం

ముందుగా భూమిని దుక్కిచేసి పశువుల ఎరువులతో సారవంతం చేసుకోవాలి. భూమిని మెత్తగా చేసుకుని బోదెలు ఏర్పాటు చేయాలి. ఎకరాకు 3 వేల మొక్కలు నాటుకోవాలి. మొక్కకు మొక్కకు మధ్య 1.5 మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. నీరు ఇంకే తేలికపాటి నేలలు, సూర్యరశ్మి బాగా తగిలే వాతావరణం రోజా మొక్కల పెంపకానికి అనుకూలం. రోజా పూల మొక్కలను ఎప్పుడైనా నాటుకోవచ్చు. ఎండా కాలంలో అయితే నీటి వసతి లేకపోవడం, ఎండలు తీవ్రంగా ఉంటాయి. కాబట్టి వర్షాలు పడే సమయం (సెప్టెంబరు–అక్టోబరు మధ్య కాలం)లో నాటుకుంటే మంచిది. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటుకోవాలి. ఇందుకు మరో 500 మొక్కలు అవసరమవుతాయి.

ఖర్చు–రాబడి

చిట్టిగులాబి, రోజా (మీనియేచర్ రకం)మొక్క రూ.20 బెంగళూరు, తమిళనాడు క్రిష్ణగిరి నుంచి తెప్పించుకోవాలి. ఎకరా మొక్కల కోసం రూ.60 వేల పెట్టుబడి అవుతుంది. తొలి ఏడాది ఇతర ఖర్చులు మరో రూ.60 వేల వరకు అవుతాయి. తర్వాత సంవత్సరం నుంచి ఎకరాకు సుమారు రూ.45 వేల ఖర్చు అవుతుంది. ఒక్కసారి నాటుకుంటే ఐదేళ్ల పాటు పూల దిగుబడి వస్తుంది. ప్రతి రోజు 20 నుంచి 30 కేజీల పూల దిగుబడి వస్తుంది. ప్రస్తుత మార్కెట్‌ను బట్టి సగటున రోజుకు రూ.2 వేల వరకు రాబడి వస్తుంది.

యాజమాన్య పద్ధతులు

మొక్కలు బెట్టకు రాకుండా నాలుగు రోజులకొకసారి నీటిని పెట్టాలి. మెట్ట ప్రాంతం కావడంతో నీటి వసతి తక్కువగా ఉన్నందున నీటి ఆదా కోసం డ్రిప్ వసతి కల్పించుకోవాలి. మొక్కదశ నుంచే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. 20 రోజులకు ఒకసారి 28:28 పాస్ఫేట్‌ను వాడాలి. దీని వల్ల మొక్క బాగా పెరుగుతుంది. కలుపు నియంత్రణ చర్యలు తరచూ చేపడు తుండాలి. లేకపోతే కలుపుతో చీడపీడలు ఆశించే అవకాశం ఉంది. రోజా మొక్కలకు వేసిన ఎరువు, నీటిని కూడా కలుపు మొక్కలు స్వీకరించడంతో నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. సంవత్సరానికి ఒక సారి కొమ్మ కత్తిరింపులు చేయాలి. చనిపోయిన, ఎండిపోయిన, తెగులు, పురుగు ఆశించిన కొమ్మలను తొలగించాలి. కొత్త చిగుర్లు ఎంత ఎక్కువగా వస్తే పూలు కూడా అంత ఎక్కువగా పూస్తాయి. కొమ్మలను కత్తిరించిన తరువాత ప్రతి మొక్క చుట్టూ 8 కేజీల పశువుల ఎరువు వేయాలి. 3 నుంచి 5 కేజీల వేపపిండి ఎరువు వేసుకోవాలి. నాటిన 5 నెలల తరువాత నుంచి పూల దిగుబడి వస్తుంది. గులాబీలు సగం విచ్చుకున్న తరువాత కోత కోయాలి.

సస్య రక్షణ చర్యలు

పెంకుపురుగు రాత్రి పూట ఆకులను వంకర టింకరగా కొరికి తినేస్తాయి. దీని నివారణకు సాయంత్రం సమయాల్లో మలాథియాన్‌ను పిచికారీ చేసుకోవాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే కొరాజియాన్ పిచికారీ చేయాలి. పేను పురుగుల కారణంగా ఆకుల కొసలు, మొగ్గలు నల్లగా మారు తాయి. దీని నివారణకు కొరాజియాన్‌ను పిచికారీ చేయాలి.

ఎర్రనల్లి:

వాతావరణం వేడిగా ఉన్నప్పుడు ఎర్రనల్లి ఎక్కువగా ఆశిస్తుంది. దీని వల్ల మొత్తం ఆకులు రాలిపోతాయి. దీని నివారణకు కూడా కొరాజియాన్‌ను పిచికారీ చేయాలి.

బూడిద తెగులు నివారణ:

బూడిద తెగులు సోకినపుడు కార్బండిజం, నల్ల మచ్చలు ఏర్పడినపుడు మాంకోజెబ్ లేదా కార్బండిజం మందులను తగిన మోతాదులో పిచికారీ చేయాలి. ఎండు తెగులు వస్తే ముందుగా కత్తిరించిన కొమ్మ నుంచి వస్తుంది. కత్తిరించిన ప్రదేశంలో రాగిధాతు సంబంధమైన మందును పేస్టులాగా పూయాలి. ఈ విధంగా సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్లు, పురుగులను నివారించవచ్చు.

భక్తులకు అన్నదానం



శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో అన్నదానం

కార్వేటినగరం: శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీ కార్వేటినగరానికి చెందిన దాతలు ఎ.రాజేంద్ర, ఎ.రజనీ దంపతులు ఆదివారం అన్నదానం చేపట్టారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్, దాతలు రాజేంద్ర, రజనీ వారి కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని శ్రీ కామాక్షి అంబికా సమేత శ్రీ అగస్తీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాది పూజలు నిర్వహించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం శ్రీ కాలభైరవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూలవర్లకు అభిషేకం చేశారు. అనంతరం భక్తులు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్, శ్రీ కాలభైరవ ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్, టీడీపీ నాయకులు వసంత కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనారాయణుని కల్యాణం



ఉభయదారులకు స్వామివారి చిత్రపటం బహూకరణ

గంగాధరనెల్లూరు: వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నారాయణస్వామి వారికి అభిషేకంతో పాటు కల్యాణోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చిత్తూరు నగరానికి చెందిన విశ్వనాథ రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం భక్తులందరికీ తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన శ్రీదేవి ప్రసాద్ దంపతులు ఉభయ దారులుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెన్నై హైకోర్టు లాయర్ గాంధీ, ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశ్వర్ రెడ్డి, అర్చకులు విష్ణు స్వామి, గోవిందస్వామి భక్తులు పాల్గొన్నారు.

కవి చంద్రశేఖర్‌కు సన్మానం



చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్

నగరి: ఉగాదిని పురస్కరించుకొని చిత్తూరులో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో నగరి మండలం ముడిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ సన్మానం అందుకున్నారు. కలెక్టర్ ఆహ్వానం మేరకు ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఆయన భువనవిజయం నాటక ప్రదర్శనలో అయ్యలరాజు రామభద్ర కవి పాత్రలో కవితా గానంతో తన ప్రతిభను కనబరిచారు. కలెక్టర్ ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు.

ఉమాపతిరెడ్డి మృతి చాలా బాధాకరం



నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: ఉమాపతిరెడ్డి మృతి చెందడం చాలా బాధాకరమని చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. మండలంలోని వసంతాపురానికి చెందిన మాజీ సైనికోద్యోగి ఉమాపతిరెడ్డి(73) గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన నేడు మన మధ్య నుంచి లేకపోవడం బాధాకరంగా ఉందన్నారు. అనంతరం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు సర్పంచ్ రజినీకాంత్, గ్రామస్తులు ఉన్నారు.

శ్రీవెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

నింద్ర: మండలంలోని నింద్ర క్రాస్ రోడ్డు వద్ద ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం చేశారు. చెన్నై పెరంబూరుకు చెందిన భక్తులు తిరుమలకు కాలినడకన వస్తూ మార్గమధ్యలోని స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా ఉగాది పూజలు









శ్రీకోదండరామాలయంలో ప్రత్యేక అలంకరణ, వెదురుకుప్పం: ప్రత్యేక అలంకరణలో కొండమల్లీశ్వరుడు, తిరుచ్చి వాహనంపై శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి, ప్రత్యేక చందనాలంకరణలో శ్రీప్రసన్నాంజనేయస్వామి

నగరి: మున్సిపల్, మండల పరిధిలోని ఆలయాల్లో ఆదివారం ఉగాది పూజలు వైభవంగా జరిగాయి. కరియమాణిక్య స్వామి ఆలయంలో విశ్వావసు నామ ఉగాదిని పురస్కరించుకొని విశేష పూజలు చేయగా పురోహితులు ప్రసాద్‌శర్మ పంచాంగ శ్రవణం చేశారు. రాశుల వారీగా ఏడాది ఫలితాలను వివరించారు. కొత్త సంవత్సరంలో సూర్యుడు కుంభ రాశి నుంచి మీనరాశిలోకి సంక్రమించడం మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. అన్ని విధాలుగా ఈ ఏడాది మంచి జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పంచాంగ శ్రవణం విని శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్య స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారి వెంకటరమణ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. టీఆర్ కండ్రిగలోని కన్నుల దేవత దేశమ్మ దేవాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయ సమీపంలోని శ్రీప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక అలంకారం చేయగా భక్తులను ఆకట్టుకుంది. శ్రీకరకంఠేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయప్రదక్షిణం చేసి స్వామిని దర్శించుకొని కర్పూర హారతులు స్వీకరించారు. పాతభజనగుడి వీధిలోని శ్రీకోదండరామాలయం, భేరి వీధిలోని రామాలయంలో ఉగాది పురస్కరించుకొని సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వాములకు చేసిన అలంకరణలు ప్రత్యేకంగా నిలిచాయి. పట్టణ పరిధిలోని ఓంశక్తి ఆలయం, సాయిబాబా ఆలయం, హనుమంతేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పూజలు నిర్వహించారు.

మాజీ మంత్రి రోజా ఉగాది పూజలు

మాజీ మంత్రి ఆర్కే రోజా ఆదివారం తన స్వగృహంలో శాస్త్రోక్తంగా ఉగాది పూజలు నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరం శుభఫలితాలను ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు. అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది అందరికీ కొత్త ఉత్సాహాన్ని నింపాలన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: ప్రసిద్ధి చెందిన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి ఆలయంలో మంగళవారం ఉగాది ఉత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించారు.ఉదయం 9.30 నుంచి 10.30 గంటల నడుమ స్వామివారి ఉత్సవమూర్తులకు వేద పండితులు స్నపన తిరుమంజనం చేపట్టారు. అనంతరం 4 గంటలకు వేదపడింతులు ఆలయ ఆవరణలో శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివార్లను కొలువు దీర్చి ఉగాది ఆస్థానం నిర్వహించారు. అలాగే స్వామివారి ఉత్సమూర్తులను తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి ఆలయ మాడ వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. రాత్రి 8.30 ఏకాంత సేవ నిర్వహించి స్వామివారిని పవళింప జేశారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, అర్చకులు రమేష్, శబరీష్, గోపాలస్వామి, షరాబు బాబు సురేష్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.





ఉగాది పూజల్లో మాజీ మంత్రి ఆర్కేరోజా, నగరి శ్రీకరియమాణిక్య స్వామి ఆలయంలో ఉగాది అభిషేకాలు





పంచాగం శ్రవణం చేస్తున్న ప్రసాద్‌శర్మ, స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేద పండితులు

సాయిబాబా ఆలయంలో..

కార్వేటినగరం సాయి బాలాజీ నగర్‌లో వెలసి ఉన్న శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి పూజా కార్యక్రమానికి గాజుల నాగేశ్వరరావు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బాలాజీ, కమిటీ సభ్యులు చిరంజీవిరెడ్డి, పయణిరెడ్డి పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని జీడీ నెల్లూరులో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. సమాచార హక్కు చట్టం ఉప కార్యాలయంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు బండి పట్టాభి రెడ్డి, బాలగంగాధర తిలక్, డీకే కుమార్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: మండలంలో ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా పలు గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రమైన నింద్ర శివాలయంలో ఉగాది పండుగ పూజలు నిర్వహించారు. అదే విధంగా ఓం శక్తి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పంచాంగ శ్రవణం చేపట్టారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండల ప్రజలు ఆదివారం ఘనంగా వేడుకలను నిర్వహించారు. డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణం చేశారు. చవటగుంటలోని నందీశ్వర స్వామి ఆలయం, ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయం, కొమరగుంటలోని పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించారు.

పుత్తూరులో..

పుత్తూరు: పట్టణ ప్రజలు ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్థానిక శ్రీధర్మరాజులస్వామి ఆలయం నుంచి ద్రౌపదీదేవి ఉత్సవ విగ్రహంతోపాటు మహిళలు పాల కలశాలతో ఊరేగింపుగా సదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరానికి తరలివచ్చారు. గీతా మందిరంలో శ్రీకృష్ణ పరమాత్మకు భక్తులు స్వహస్తాలతో పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అర్చనలు చేశారు. మధ్యాహ్నం ధర్మరాజుల స్వామి ఆలయ ఆవరణలో ప్రముఖ శల్య వైద్యులు ప్రతాప్‌రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గీతామందిరంలో గీతా పారాయణం, భజనలు, కవితలు, సందేశాల కార్యక్రమం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. పట్టణంలోని తరుణ గణపతి, వరసిద్ధి వినాయక, ఆంజనేయస్వామి, సదాశివేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మండలంలోని అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అభయ ప్రదాయినిగా కొమ్మేపెల్లమ్మ

యాదమరి: భక్తులు కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా, అభయ ప్రదాయినిగా కొమ్మేపెల్లమ్మ కొలువై ఉందని ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రచేను వద్ద కొమ్మేపెల్లమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి వేదపండితులచే ప్రత్యేక అభిషేకాలు, ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు చేశారు. అనంతరం భక్తులకు విశ్వరూప దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

బంగారుపాళెంలో ఉగాది వేడుకలు

బంగారుపాళెం: మండలంలో తెలుగు ప్రజలు ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర (ఉగాది) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని ప్రధాన దేవాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. మొగిలి శివాలయం, మొగిలివెంకటగిరిలోని శ్రీకోదండరామాలయం, నలగాంపల్లెలోని శ్రీభూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, బంగారుపాళెం గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయం, వజ్రాలపురంలోని జలకంఠేశ్వర స్వామి ఆలయం, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కొత్త సంవత్సరంలో సర్వశుభాలు కలగాలని భక్తులు పూజలు చేపట్టారు. ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. మొగిలి శివాలయం, బంగారుపాళెం ముత్యాలమ్మ ఆలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అర్ధగిరి క్షేత్రంలో ఘనంగా ఉగాది సంబరాలు



అర్ధగిరి క్షేత్రంలో ఉగాది పంచాంగ శ్రవణం

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకొని ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. శాస్త్రోక్తంగా స్వామికి పూజలు నిర్వహించి ధూపదీపనైవేద్యం సమర్పించారు. అనంతరం తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా అర్చకులు పంచాగం శ్రవణం పఠనం చేసి భక్తులకు వినిపించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చళ్ళు, ఉచితంగా తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అరగొండ కోదండరామాలయంలో

మండలంలోని అరగొండ కోదండరామాలయంలో ఆదివార ం ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకొని సీతారామలక్ష్మణులకు భక్తిప్రపత్తులతో భక్తులు పూజలు చేయించారు.తర్వాత అర్చకులు ఉపాది పంచాగం శ్రవణం పఠనం చేయించారు. భక్తులు భక్తితో పంచాగ శ్రవణంను ఆలకించారు. అనంతరం స్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకొన్నారు. భక్తులకు ఉగాది పచ్చళ్ళు పంచిపెట్టారు. అదే విధంగా ఉగాధి పర్వదినం సందర్భంగా మండలంలోని జొన్నగురకలలో వెలసియున్న విరుపాక్షమ్మ ఆలయంలో అమ్మ వారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు.